


మతుకుమల్లి సావిత్రి

శుభవార్త! ఎన్నాళ్లో ఎదురు చూసిన శుభవార్త! ఆలోచించే వయసు వచ్చినప్పటినుంచీ ఊహించిన కల నిజమయింది! దేనికోసమైతే ఆశించి, నిరీక్షించి, ఇక జరగదని ఆశ వదిలేసుకున్నాడో అదే నిజమయింది!

జన్మలో ఇంతకుముందెప్పుడూ ఎరగని ంతోషంలో మునిగిపోతూ, అదిచ్చే ..త్సాహంతో తేలిపోతున్నాడు చంద్రం. ఇంత ఆనందదాయకమైన ఆ సంఘటనని మళ్లీ నెమరువేసుకో సాగాడు...

డాక్టర్ సోమశేఖర్ తన ఆఫీసులోకి వచ్చాడు. అతనికోసమే ఎదురు చూస్తున్న చంద్రం అతని వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

డాక్టర్ కొన్ని క్షణాలు తటపటాయించి, చివరకు ఏదో ఒక నిశ్చ

యానికి వచ్చినట్టు, "ఆఁ చంద్రం గారూ. ఏమిటి సంగతి? కులాసా?" అన్నాడు ఉపోద్ఘాతంగా.

"నాకేం తెలుస్తుంది, డాక్టర్? అది మీరే చెప్పాలి."

డాక్టర్ తెల్లబోయి, నవ్వుకుని "సరే!" అన్నాడు.

"ఆ టెస్టుల గురించి ఇవ్వాళ చెపుతానన్నారు" అని గుర్తుచేశాడు చంద్రం.

"ఆఁ. దాన్ని గురించి చెపుదామనే. కాని తొందరేమిటి లెండి. అన్నట్టు, మీరు ఎప్పుడూ ఒక్కరే వస్తారు, మీ వాళ్లెవరూ ఇక్కడ లేరేమిటి?" అని అడిగాడు డాక్టర్.

ఈ ప్రసక్తి దేనికి నాంది ప్రస్తావనో గ్రహించాడు చంద్రం. "ఇక్కడే కాదు. ఎక్కడా లేరు, డాక్టర్!" అని చిరునవ్వుతో, "మీరు చెప్పవలసిన దుర్వార్తలన్నీ నాతోనే చెప్పాలి" అన్నాడు.

ఇంత సులభంగా తన మనస్సులో మాట కనుక్కున్నందుకు డాక్టర్ కొంచెం తడబడి, 'ఆఁ, దుర్వార్తలేమున్నాయి లెండి ..." అంటూ నవ్వేశాడు.

"ఏదో ఉన్నదని మీ వాలకమే స్పష్టంగా చెపుతున్నది, డాక్టర్! ఇంతకీ, మీ పరీక్షలో ఏం కనిపెట్టారేమిటి?"

"చూడండి, మిస్టర్ చంద్రం. ప్రస్తుతం మీ ఆరోగ్య పరిస్థితి ఏమంత బాగాలేదు..."

"బాగా ఉందనుకుని నేనెప్పుడూ భ్రమపడలేదు" అని అడ్డువచ్చాడు చంద్రం.

డాక్టర్ చెప్పుకుపోయాడు. "ఇప్పుడు మీ కొక బెడద వచ్చింది. మీ హార్ట్ చాలా వీక్‌గా ఉన్నది..." చంద్రం ఏమైనా అంటాడేమోనని ఆగాడు డాక్టర్. ప్రత్యుత్తరం ఏమీ రాకపోగా, ఇందాకటి చిరునవ్వుతోనే కూర్చుని ఉన్నాడు చంద్రం.

"దీనికి ముఖ్య కారణం శారీరకమైనది కాదు. మానసికమైనదని నా ఉద్దేశం. మీరు మామూలుగానే ఏదో దిగులుగా ఉంటారు. ఎప్పుడూ విచారంగా ఏదో సమస్యలతో ఉన్నట్టు ఉంటారు..."

చంద్రం ముఖంలో చిరునవ్వు మాయమయింది. తత్తరపాటు, చిరాకు అతను వాటిని అణుచుకోవాలనుకున్న ప్రయత్నాన్ని విఫలం చేస్తూ తొంగి చూస్తున్నాయి.

డాక్టర్ ఇంకా మాట్లాడుతూనే ఉన్నాడు. "ఆఫ్‌కోర్స్, ఇప్పుడే మీ చెప్పారు లేరన్నారు. ఆ ఒంటరితనం వల్ల నిరాశ, నిస్పృహలు కలగవచ్చు. మీ పరిస్థితిలో మీకు ఒంటరితనంగా ఉండటం సహజమే ననుకోండి. కాని, దానికోసం అంత నిరాశ పడకూడదు. మీ కిప్పుడేం వయసు మించిపోలేదు. రేపో మాపో పెళ్లి చేసుకుంటారు. మీరూ ఒక సంసారం ఏర్పరుచుకుంటారు..." (చంద్రం నవ్వుకున్నాడు) "... ఇంతకీ చెప్పొచ్చే దేమంటే మీరు ఇలా అస్తమానూ బాధపడి సాధించగలిగేది ఏమీ లేదు. ఇలాంటి ఆవేదనతో మనసు చెడగొట్టుకోవడం ఏమంత మంచిది కాదు. మీ మానసికావేదన అని మీరు తగ్గించుకోవాలి. ఆ విషయం కోసమే కాదు, మరిచిపోవాలికూడా! లేకపోతే ..."

ఆసక్తిగా వింటూ, డాక్టర్ మాటలను ఊహిస్తున్న చంద్రం ఉత్సాహం దాచుకుంటూ, "లేకపోతే? ఏమవుతుంది?" అని ఆత్రంగా అడిగాడు.

"ఏమవుతుందా? లేకపోతే ..."

చంద్రం అదే ఉత్సాహంతో, "లేకపోతే చస్తానంటారా?" అనడిగాడు.

ప్రాణ భయం ఏమీ లేకపోగా, ఈ విషయాన్ని ఒక వినోదంగా తీసుకుంటున్న చంద్రాన్ని చూసి తెల్లబోయాడు డాక్టర్ సోమశేఖర్. కొంచెం కఠినంగా, "ఇది పరిహాసమాడే విషయం కాదు, మిస్టర్ చంద్రం!" అన్నాడు.

"తెలుసు, డాక్టర్! ఇది నా జీవన్మరణ సమస్య!" తేలిగ్గా అన్నాడు చంద్రం, కులాసాగా నవ్వుతూ.

ఇంకా తెల్లబోయాడు సోమశేఖర్. "మీ రిలా ఉంటే లాభంలేదు, చంద్రంగారూ. అసలు విషయం మాటిమాట చెబుతాను. మీ ప్రస్తుత పరిస్థితిలో మీరు ఏ రకమైన ఉద్రేకానికీ తట్టుకోలేరు. ఉద్రేకమే కాదు, ఏ విధమైన తీవ్రమైన మానసిక సంఘర్షణని కూడా తట్టుకోలేరు. ప్రస్తుతం మీరు అలాంటి సంఘర్షణలో ఉన్నట్టు కనిపిస్తున్నారు కనక ప్రత్యేకించి చెబుతున్నాను. మీ మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలి. మీరు ఏ చీకూ, చింతా లేకుండా హాయిగా ఉంటే, మిగతావి వాటంతట అవే సర్దుకుంటాయి. లేదూ, మీ రిప్పటిలాగే ఉన్నారూ— ఇంక రెండు నెలలు, మూడు నెలలు—

**జీవితంలో సంతోషం కోసం చూసి చూసి విసిగిపోయాడు అతడు. బ్రతకడం మీద మోజు ఏనాడో పోయింది. తన బ్రతుక్కి అర్థం ఏమీలేదని, తను బ్రతకడం ఎవరికీ అవసరం కాదని ఏనాడో గ్రహించినా ఆత్మహత్య అనే పరిష్కార మార్గం నచ్చక యాంత్రికంగా రోజులు గడుపుతున్నాడు. మరణించాలనే కోరిక ఒక్కటి మాత్రమే మిగిలి ఉంది. అలాంటప్పుడు డాక్టరు ఇచ్చిన గడువు శుభవార్త కాక ఏమవుతుంది?**

అంతకంటే ఎక్కువ నిలవలేరు. మీరు బాగా అశ్రద్ధ చేశారు. నా దగ్గరికి ఇంతకంటే చాలా ముందుగానే రావలసింది."

"అంటే మీ ఉద్దేశం నేనిక మూడు నెలలకంటే ఎక్కువ బ్రతకనని. అంతేగా?"

"మీరు తగిన శ్రద్ధ తీసుకోకపోతే ..."

"థాంక్యూ, డాక్టర్, ఉన్నదున్నట్టు చెప్పినందుకు" అంటూ వెళ్లేందుకు లేచాడు చంద్రం.

సోమశేఖరం కూడా లేచాడు. కొంచెం ఇబ్బందిగా, "మోటుగా చెప్పానేమో?" అన్నాడు.

"అబ్బెబ్బె, అలాంటి దేమీ లేదు. మీ రలా చెప్పకపోతే అసలు సంగతి నా కెలా తెలిసి ఉండేది?"

ఇంత సౌమ్యమైన జవాబుతో ధైర్యం తెచ్చుకున్న సోమశేఖర్, హుషారుగా, "అయితే మీరు జాగ్రత్తగా ఉంటారుగా?" అన్నాడు.

"జాగ్రత్త! ఏమాత్రమూ ఉండను! ఎందుకు ఉండాలి?" అని నవ్వుతూ, "నమస్కారం, డాక్టర్. వస్తా" నని వెళ్లిపోయాడు చంద్రం.

సోమశేఖర్ అయోమయంగా చూస్తూ ఉండిపోయాడు.

. . . తలుచుకొన్న కొద్దీ ఉత్సాహంగా ఉన్నది చంద్రానికి. జీవితంలో సంతోషం కోసం చూసి చూసి విసిగిపోయిన చంద్రానికి, బ్రతకడం మీద మోజు ఏనాడో పోయిన చంద్రానికి, తన బ్రతుక్కి అర్థం

చిత్రం — పి. ఆగాచార్య (కరీంనగర్)

మూడు తలలూ రెండు కళ్లూ



ఏమీ లేదని, తను బ్రతకడం ఎవరికీ అవసరం కాదనీ ఏనాడో గ్రహించినా, ఆత్మహత్య అనే పరిష్కారం నచ్చక, యాంత్రికంగా రోజులు గడుపుతున్న చంద్రానికి, ఆశయాలన్నీ ఎగిరిపోయి, ఆశించినదేదీ అనుభవించని చంద్రానికి, అన్ని ఆశలూ పోయి, మరణించాలనే కోరిక ఒక్కటే మిగిలి ఉన్న చంద్రానికి — డాక్టర్ ఇచ్చిన గడువు శుభవార్త కాక ఏమవుతుంది?

* *

తా నింక రెండు, మూడు నెలలలో చావబోతున్నాడు. సందేహం లేదు. వెంటనే ఏర్పాట్లన్నీ చేసేసుకున్నాడు చంద్రం. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాడు. తన వ్యవహారాలన్నీ చక్కబెట్టుకున్నాడు. ఇదివరకు ఉన్న బాధలు, ఆవేదనలు ఏమీ మచ్చుకు లేకుండా పోయాయి. అతని సమస్య తీరింది. ఇదివరకు రోజూ తేరగానే ఎదురయ్యే సంఘర్షణ, 'నే నెందుకు బ్రతికి ఉన్నాను?' అన్నది కూడా మాయమయింది. ఇప్పుడు ఆ ప్రశ్న ఎదురైతే 'చావడంకోసం' అని వెంటనే జవాబు చెప్పుకునేవాడు చంద్రం. అతని మనస్సు ఇప్పుడు చాలా నిర్మలంగా, నిశ్చింతగా ఉన్నది. ఈ నిరీక్షణలో రోజులు ప్రశాంతంగా, సాఫీగా, హాయిగా గడిచిపోతున్నాయి. రోజూ షికారు వెళ్ళేవాడు చంద్రం. 'ఇంక ఎక్కువ రోజులు గడపక్కరలేదు ఇక్కడ' అని ఆనందించేవాడు.

మామూలుగానే ఆ రోజు కూడా షికారు వెళ్ళాడు చంద్రం. నిజానికి అతనికి కొన్నాళ్ళనించీ కొంచెం దిగులుగా ఉన్నది. అప్పుడు డాక్టర్‌ని చూసినప్పటినించి నాలుగు నెలలు నిండబోతున్నాయి. మూడు నెలలు నిండిన మర్నాడే తారుమంటాడని అనుకొనేంత అమాయకుడు కాకపోయినా, అప్పటినించీ ఎదురుచూస్తూనే ఉన్నాడు చంద్రం. కాని 'ఆ రోజు' రాలేదు. వచ్చే సూచనలు కూడా ఏమీ కనిపించలేదు.

ఆలోచిస్తూనే రైల్వే స్టేషను దగ్గిరికి వచ్చాడు చంద్రం. ఎవరో ముసలావిడ తన మూట ఎత్తలేక అవస్థ పడుతున్నది. చంద్రం వెళ్ళి, దాన్ని ఎత్తి బెంచీమీద పెట్టాడు. పెట్టి, దాని బరువుకి ఆశ్చర్యపోయాడు. ముసలావిడ చెబుతున్న కృతజ్ఞతలు కూడా వినిపించుకోలేకపోయాడు. అంత బరువైన మూట ఎలాగ మన్నది ఒక నాలుగు నెలల క్రిందట తనకి పూర్తిగా దుస్సాధ్యం. కాని — ఇప్పుడు — అవలీలగా ఎత్తేశాడు!

ఏమిటీ వింత? ! ఇంక రెండు, మూడు నెలల తరవాత పోతాడన్నవాడికి లేని బలం, రేపో మాపో రాలిపోయేందుకు సిద్ధంగా ఉన్నవాడికి ఎలా వచ్చింది? ఏమిటి దీ నర్థం? తీవ్రంగా ఆలోచించాడు చంద్రం. అంతలోనే అర్థమయింది. తాను రేపో మాపో చావబోవటం లేదు. అసలు ఈ దగ్గర కాలంలో ఎప్పుడూ చావబోవటంలేదు! ఆవేశం, ఉద్రేకం కారుమబ్బుల్లా దూసుకువచ్చాయి. పౌరుషం, ఉక్రోషం ఉరుములు మెరుపులైతే, కోసం, కసి పిడుగు లయ్యాయి. ద్వేషం, పగ, కుండపోత వర్షంలో అతన్ని ముంచెత్తాయి.

దీని కంతటికీ కారకుడు ఆ అప్రాచ్యపు వెధవ! వెంటనే వెళ్ళి వాడి అంతు తేల్చాలి! భావ పరంపరలో ఉక్కిరిబిక్కిరి అవుతున్న చంద్రం నరినరాలు ముసకగా కనిపిస్తున్నాయని కాని, గుండెలు రొప్పుతున్నాయని కాని, చేతులు కంపిస్తున్నాయని కాని, అడుగులు తేలిపోతున్నాయనికాని గమనించనే లేదు!

తలుపైనా కొట్టకుండా లోపలికి దూసుకువచ్చిన చంద్రాన్ని చూసి నిర్ఘాంతపోయాడు డాక్టర్ సోమశేఖర్.

"ఏమి టిలా వచ్చారు?" అని అంటూనే ఉన్నా డతను.

"ఛీ! దౌర్భాగ్యుడా! నన్నింత మోసం చేస్తావా? ! పైగా, ఎందుకు వచ్చావంటావా? సిగ్గు లేదూ? నన్నిలా దగా చేయడానికి నీకు నీతి నిజాయితీలు అడ్డు రాలేదూ? నా కింత నమ్మకద్రోహం చేస్తావా? ..."

"ఏమిటి మీ రంటున్నది? దగా ఏమిటి? ..."


"నోర్మూయ్! దుర్మార్గుడా! నాకు చచ్చిపోవాలని ఉందని తెలిసే ఈ ప్లాను వేసి ఉంటావు! నా బలహీనతను బాగా తెలుసుకున్నావు! ఎందుకు తెల్లమొహం వేస్తావు? నీ నాటకం నాకు తెలిసిపోయిందిలే! ప్రశాంతంగా ఉండాలిట! నిశ్చింతగా ఉండాలిట! 'అలా ఉంటే బ్రతికి ఉంటారు' అనంటే, ఛస్తే అలా ఉండనని నీకు తెలియదూ? ఒప్పేసుకో! ఇంకా బూటకాలెందుకు? నిక్షేపంలా తెలుసు! తెలిసే, 'అలా ఉండకపోతే ఛస్తారు' అని ఆశ పెట్టావు! ఆ మాట వినగానే నాకిక ఏ బెంగా ఉండదని నీకు తెలుసు! ఏ గొడవా చింతా లేకుండా నేను ... నిశ్చింత! హాయి! ప్రశాంతత! నీక్కావలసిందే అది! నన్ను బతికి ఉంచడానికి ఛస్తానని ఆశపెట్టావు! ఓహోహోహో! ఏం తెలివి! అమోఘం, అఖండం! ..."

సోమశేఖరానికి ఇదేమీ అర్థం కాలేదు. అంటే, చంద్రం మాటలు అర్థం అయినా అవి నమ్మశక్యంగా లేవు. అందుకే అర్థంకాలేదు. కాని, చంద్రం ఇదే ధోరణిలో ఇంకా కొన్ని నిమిషాలు సాగిపోతే అతని పరిస్థితి ప్రమాదిస్తుందని గుర్తించి, అతని వాగ్ధాటిని ఆపడానికి ప్రయత్నించాడు.

"కాని ..." రెండు క్షణాలు తీక్ష్ణంగా సోమశేఖర్ వైపు చూశాడు చంద్రం. "ఇది నీ సొంత ఆలోచన కాదు. ఎవరో చెప్పి చేయించి ఉంటారు. ఎవరది? చెప్పు! చెప్పు! ..."

"మీరు ఆవేశపడకండి ..."

"హాఁ! ఏం పడితే! ఛస్తానంటావా? ఇంకా నీ కల్లబొల్లి మాటలు నమ్ముతా ననుకున్నావా, ఇడియట్? కానీయ్! నిన్నెవరు ఉసికొల్పారో చెప్పు! వాడి పేరు చెప్పడాని కెందు కింత సందేహం? నువ్వెలా ఒప్పుకున్నావు?




బెదిరించాడా? డబ్బిచ్చాడా? ఎంత? వాడెవడో నేను తెలుసుకోవాలి! ఇన్నాళ్ళూ నా కెవరూ శత్రువులు లేరనుకున్నాను. ఇప్పుడు కనీసం ఒక్కడైనా ఉన్నాడని తెలిసింది! ..."

"శత్రువేమిటి? మీ క్షేమంకోరి..."

"క్షేమం! నువ్వా నా క్షేమం కోరే చెప్పావు కదూ, అప్పుడు ఆ మాటలన్నీ?! నువ్వే అసలు దుర్మార్గుడివి! నీ పని ఇప్పుడే తేలుస్తా, రా! యూ రాస్కెల్! యూ స్కౌండ్రల్! యూ రోగ్!"

డాక్టర్ మీదకు దూకబోయిన చంద్రం అక్కడే కూలిపోయాడు.

యాంత్రికంగా తన ధర్మం నెరవేర్చడానికి చంద్రం దగ్గరకు వెళ్ళాడు డాక్టర్, ఆశ ఏమాత్రం లేకపోయినా. ★